బావిలో పడి యువకుడి మృతి

సిర్పూర్(యు), జనవరి 16 : ఎడ్లకు నీరు పెట్టడానికి వెళ్లి తన వ్యవసాయ బావిలో పడి మడావి శ్రీరాం(38) మృతి చెందాడు. హెడ్ కానిస్టేబుల్ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొడ్డిగూడ గ్రామానికి చెందిన శ్రీరాం ఆదివారం సాయంత్రం ఎడ్లకు నీరు పెట్టేందుకు తన చేను వద్దకు వెళ్లాడు. తిరిగి రాక పోవడంతో అతని తమ్ముడు గోపాల్ చేను వద్దకు వెళ్లి చూడగా ఎడ్లు ఉండి శ్రీరాం కనిపించక పోవడంతో ఆందోళన చెందాడు. బావి పక్కనే శ్రీరాం చెప్పులు ఉన్న విషయాన్ని గమనించాడు. కానీ చీకటి పడడంతో ఇంటికి తిరిగొచ్చాడు. సోమవారం ఉదయం గ్రామస్తులతో కలిసి బావిలో వెతుకగా శ్రీరాం శవం లభించింది. గోపాల్ ఫిర్యాదు మేరకు లింగాపూర్ ఎస్ఐ ప్రవీణ్ కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నాడు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

సిర్పూర్(టీ), జనవరి 16 : మండలంలోని లక్ష్మీపూర్ గ్రామ శివారులో పేకాట స్థావరంపై సోమవారం ఎస్ఐ దీకొండ రమేశ్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేశారు. లక్ష్మీపూర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు అక్కడికి వెళ్లి 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. రూ.15,400 స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేశ్ తెలిపారు.

ఇందానిలో 8 మందిపై కేసు

వాంకిడి, జనవరి 16: మండలంలోని ఇందాని గ్రామ శివారు ప్రాంతంలో పేకాట స్థావరంపై వాంకిడి పోలీసులు మెరుపుదాడి చేశారు. ఎస్ఐ సాగర్ తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం సాయంత్రం ఇందాని గ్రామ శివారులో పేకాడుతున్నారని అందిన సమాచారం మేరకు ఎస్ఐ సాగర్, సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. పేకాడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకున్నామని ఆయన తెలిపారు. వారి వద్ద నుంచి వద్ద నుంచి రూ.8710 నగదు స్వాధీనం చేసుకొని 8 మందిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. వాంకిడి పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో పేకాడినా, దేశీదారు, గుడుంబా విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

రేషన్ బియ్యం పట్టివేత

బియ్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

రెబ్బెన, జనవరి 16 : దేవులగూడ గ్రామంలో రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు రాజ్ కుమార్, శ్యాంలాల్ పేర్కొన్నారు. హైదరాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్ ఫోర్స్ నుంచి వచ్చిన సమచారం మేరకు దేవులగూడలోని ఓ షెడ్డులోకి వెళ్లి తనిఖీలు చేయగా, అక్రమంగా తరలించేందుకు నిల్వ ఉంచిన 110 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేశామని తెలిపారు. ఆ బియ్యాన్ని కాగజ్ నగర్ ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

రేపు స్థాయీ సంఘాల సమావేశాలు

ఆసిఫాబాద్ టౌన్, జనవరి 16 : జిల్లా కేంద్రంలోని జడ్పీ సమావేశ మందిరంలో ఈ నెల 18న స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి రత్నమాల ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు స్థాయీ సంఘం-7 (పనులు), స్థాయీ సంఘం-1 (ప్రణాళిక, ఆర్థిక), మధ్యాహ్నం 12.30 నుంచి 1.30 గంటల వరకు స్థాయి సంఘం-2 (గ్రామీణ అభివృద్ధి), 1.30 నుంచి 2.30 గంటల వరకు స్థాయీ సంఘం-3 (వ్యవసాయం), సాయంత్రం 3 నుంచి 4 గంటల వరకు స్థాయీ సంఘం-4 (విద్య, వైద్యం), 4 నుంచి 5 గంటల వరకు స్థాయీ సంఘం-5 (మహిళా సంక్షేమం), 5 నుంచి 6 గంటల వరకు స్థాయీ సంఘం-6 (సాంఘిక సంక్షేమం) సమావేశాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గౌరవ సభ్యులు, అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో సకాలంలో హాజరుకావాలని కోరారు.

ఘనంగా సంక్రాంతి సంబురాలు

- వాకిళ్లలో ఆకట్టుకున్న రంగవల్లులు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు

దహెగాం : లగ్గామ ఆలయంలో ముగ్గులు వేస్తున్న మహిళలు



ఆసిపాబాద్ టౌన్ : బాబాపూర్ లో ఎడ్ల బండ్ల పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ మల్లికార్జున్ యాదవ్

కాగజ్‌నగర్, జనవరి 16: కాగజ్‌నగర్ పట్టణంతో పాటు మండలంలో సంక్రాంతి పండుగను సోమవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు, యువతులు ముగ్గులు వేసి గొబ్బెమ్మలు ఉంచి పూజలు చేశారు. మహిళలు నోములు నోచి వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. ఇంటింటా పిండి వంటలు చేసుకొని వేడుకలు ఘనంగా నిర్వహించారు.

రెబ్బెనలో..

రెబ్బెన, జనవరి 16: మండలంలోని అన్ని గ్రామాల్లో సంక్రాంతి పండుగను సంతోషంగా నిర్వహించుకున్నారు. మహిళలు ఇండ్ల ముందు వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. పిల్లలు, యువకులు గాలిపటాలు ఎగురవేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

సంస్కృతిని కాపాడుకోవాలి..

దహెగాం, జనవరి 16 : ప్రస్తుత పరిస్థితుల్లో మన సంస్కృతీసంప్రదాయాలను కాపాడు కోవాల్సిన అవసరం ఉందని ఎస్ఐ సనత్ కుమార్ అన్నారు. మండలంలోని లగ్గా గ్రామంలో శ్రీ ఉమా చంద్రశేఖరస్వామి ఆలయంలో యువజన సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. గ్రామానికి చెందిన 40 మంది ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోండ్ర అనూష, గ్రామ పెద్దలు ప్రభాకర్ గౌడ్, ఆలయ ధర్మకర్త ప్రభాకర్, ఉపాధ్యాయులు పోచయ్య, బుర్రి శ్రీనివాస్, పోతాజుల లక్ష్మణ్, లగ్గాం దామోదర్, జర్పుల శ్యాం, పంచాయతీ కార్యదర్శి రాకేశ్, ఆలయ అర్చకులు శ్రీకాంతాచారి, యూత్ కమిటీ అధ్యక్షుడు ఇంగిలి రవి, ఉపాధ్యక్షుడు రాజేశ్ పాల్గొన్నారు.

బెజ్జూర్‌లో..

బెజ్జూర్, జనవరి 16 : మండలంలో సంక్రాంతి, కనుమ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలు, యువతులు రంగు రంగుల ముగ్గులు వేశారు. పిండి వంటలు చేసుకొని బంధు మిత్రులను ఆహ్వానించి వేడుకలను నిర్వహించారు.

కెరమెరిలో..

కెరమెరి, జనవరి16: మండలంలో సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.వాకిళ్ల ముగ్గులు వేసి, వేడుకలను ఘనంగా నిర్వహించారు. పిల్లలు, యువకులు గాలి పటాలు ఎగురవేస్తూ సంబురాలు నిర్వహించారు.

బాబాపూర్‌లో ఎడ్ల బండ్ల పోటీలు..

ఆసిఫాబాద్ టౌన్, జనవరి16 : మండలంలోని బాబాపూర్‌లో ఎడ్ల బండ్ల పోటీలను ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ సమక్షంలో నిర్వహించారు. ఈ పోటీల్లో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రథమ విజేతకు రూ.2 వేలు, ద్వితీయ విజేతకు వెయ్యి రూపాయలు బహుమతి ని ఎంపీపీ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, సర్పంచ్ వర లక్ష్మి, గ్రామ పెద్దలు శంకర్, కిషన్, గణపతి, రాజన్న నాయకులు పెంటయ్య, రాజు, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు

మండలంలోని ఈదులవాడలో సంక్రాంతి వేడుకలను పురస్కరించుకుని ఎంపీపీ మల్లికార్జున్ ఆధ్వర్యంలో సర్పంచ్ భీమేశ్ ముగ్గుల పోటీలు నిర్వహించారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి ఎంపీపీ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిలువేరి వెంకన్న, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దహెగాం : విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్ఐ సనత్ కుమార్

కోదండ రామాలయంలో కైలాసగిరి నోము

ప్రత్యేకపూజలు చేస్తున్న మహిళలు

పెంచికల్ పేట్, జనవరి 16 : మండల కేంద్రంలోని కోదండ రామాలయంలో ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో సోమవారం కైలాసగిరి నోమును వైభవంగా నిర్వహించారు. అర్చకుడు మూలమట్టం దేవేందర్, భానుతేజ, సిద్ధార్థ బియ్యంపై శివలింగం ఏర్పాటు చేసి దాని చుట్టూ 108 విబూది ఉండలు, రుద్రాక్షలు ఉంచి.. వైకుంఠ వత్తులతో దీపాలు వెలిగించారు. పూలు, పండ్లతో అలంకరించి పూజలు చేశారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే కోనప్ప పరామర్శ

పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

బెజ్జూర్, జనవరి 16 : మండలంలోని ఎల్కపల్లి గ్రామానికి చెందిన మాలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొట్రంగి రామకృష్ణ తండ్రి మృతిచెందాడు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మంగళవారం రామకృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కోనప్ప వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సకారం, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు కోండ్ర జగ్గాగౌడ్, కో-ఆప్షన్ సభ్యుడు బషారత్ ఖాన్, సర్పంచ్‌లు రవి, తిరుపతి, శేఖర్, ఎంపీటీసీలు లంగారి శ్రీనివాస్, గురిజాల వెంకన్న, నాయకులు ఉన్నారు.

ఏఐటీయూసీ డైరీ ఆవిష్కరణ

డైరీ ఆవిష్కరిస్తున్న బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్

రెబ్బెన, జనవరి 16: బెల్లంపల్లి ఏరియా గోలేటి జీఎం కార్యాలయంలో మంగళవారం ఏఐటీయూసీ డైరీని బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్ ఆవిష్కరించినట్లు ఆ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ తరపున సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాయిళ్ల నర్సయ్య, సింగరేణి కాలరీస్ కోల్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ గోలేటి బ్రాంచ్ అధ్యక్షుడు అరికిల్ల స్వామి, కార్యదర్శి రవిప్రసాద్‌గౌడ్, డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు ఇగురపు సంతోష్, తదితరులున్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, సంఘం ఉపాధ్యాయులు

కాగజ్‌నగర్, జనవరి 16 : కాగజ్‌నగర్ పట్టణంలో సోమవారం ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్‌ను బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మహనీయుల అడుగుజాడల్లో నడిచి నవ సమాజం నిర్మాణం కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి చరణ్‌దాస్, జిల్లా అధ్యక్షుడు జాడి కేశవ్, ప్రధాన కార్యదర్శి దుర్గం తులసీరాం, సంఘం నాయకులు, మోహన్, దుర్గం చరణ్‌దాస్, జాడి దేవాజీ, గురుపాదం, ప్రభాకర్ పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

- చిర్రకుంట అటవీ సెక్షన్ అధికారి సాయిచరణ్, ఆసిఫాబాద్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అప్పల కొండ

ఆసిఫాబాద్ టౌన్ : అవగాహన కల్పిస్తున్న సెక్షన్ అధికారి సాయిచరణ్

ఆసిఫాబాద్ టౌన్, జనవరి16: వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని చిర్రకుంట అటవీ సెక్షన్ అధికారి సాయిచరణ్ అన్నారు. మంగళవారం మండలంలోని షాకన్ గోంది గ్రామ పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్యప్రాణులు సంరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. అటవీ ప్రాంతంలో విద్యుత్ తీగలు అమర్చడం, జంతువులను వేటాడడం, ఉచ్చులు వేయడం, విష ప్రయోగం చేయడం నేరమన్నారు. ఎవరైనా అనుమానితులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని సూచించారు. పశువులు ఏవైనా అటవీ జంతువుల బారిన పడితే తక్షణ సాయం కింద 5000 రూపాయలు అందజేస్తామని తెలిపారు. అనంతరం జంతువుల సంరక్షణకు సంబంధించి పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీట్ అధికారి ఎం.శ్రీనివాస్, సర్పంచ్ మడావి సీత తిరుపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సర్కేపల్లి గ్రామంలో..

వాంకిడి, జనవరి 16: మండలంలోని అటవీ, పులి సంరక్షణపై సర్కేపల్లి గ్రామంలో ఆసిఫాబాద్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అప్పల కొండ మంగళ వారం సర్కేపల్లి గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పులి ఎద్దు పై దాడి చేస్తే తక్షణ సాయంగా రూ.5000లను 10 రోజుల్లో పశు యజమానికి అందిస్తామని తెలిపారు. పులి కనిపించినా, అడుగులు కనిపించినా కాపరులు వెంటేఏ అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. అడవీలోని చెట్ల నరకవద్దనీ, వన్య ప్రాణులను వేటాడవద్దని కోరారు. వాంకిడి మండలంలోని అన్ని సెక్షన్ల పరిధిలో అవగాహన సదస్సు కార్యక్రమలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్ర డీవైఆర్వో సరోజారాణి, ఎఫ్ఎస్వోలు లక్ష్మణ్, సత్యనారాయణ, భగవంత్ రావు, అత్త రొద్దీన్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు తదితరులు పాల్గొ న్నారు.

వాంకిడి : అవగాహన కల్పిస్తున్న ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అప్పల కొండ

క్రీడల్లో గెలుపోటములు సహజం

- రెబ్బెన ఎస్ఐ చంద్రశేఖర్

రెబ్బెన : గోలేటిలో విజేతకు బహుమతి అందజేస్తున్న ఎస్ఐ చంద్రశేఖర్, సర్పంచ్ పోటు సుమలత

రెబ్బెన, జనవరి 16: క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తితో తలపడాలని రెబ్బెన ఎస్ఐ చంద్రశేఖర్, గోలేటి సర్పంచ్ పొటు సుమలత అన్నారు. గోలేటి గ్రామలో సంక్రాంతి పండుగ సందర్భంగా గోలేటి యూత్ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు నిర్వహించారు. మొదటి స్థానంలో నిలిచిన నర్సాపూర్ జట్టుకు షీల్డ్ తో పాటు రూ.10,016 నగదు, పెర్కపల్లి జట్టుకు రూ. 5015 నగదు అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీలకు రెఫరీలుగా జర్పుల శివాజీ, కుందారపు నరేశ్, ఎదులాపురం రాజేశ్ వ్యవహరించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు లావుడ్యా దుప్పనాయక్, అజ్మీరా బలరాంనాయక్, అజ్మీరా బాబురావు, లావుడ్యా రమేశ్, రవి, రాజు, శంకర్, తదితరులున్నారు.

బాబాపూర్‌లో వాలీబాల్ పోటీలు ప్రారంభం

చింతలమానేపల్లి, జనవరి 16: మండలంలోని బాబాపూర్ గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని యువకుల ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఎంపీపీ డుబ్బుల నానయ్య ముఖ్య అతిథిగా హాజరై పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడల్లో ఉల్లాసంగా పాల్గొనాలని కోరారు. మొదటి బహుమతి కింద రూ. 2500, రెండో బహుమతి కింద రూ. 2 వేలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మారినేతి లక్ష్మి, ఉప సర్పంచ్ కోటేశ్, డైరెక్టర్లు రాపెల్లి రామయ్య, డుబ్బుల మహేశ్, పంచాయతీ కార్యదర్శి హరిప్రసాద్, నాయకులు రామగౌడ్, మేకలశంకర్, బానేశ్, సత్తయ్య, సుధాకర్, విఘ్నేశ్, జునుగరి శేఖర్, బోర్కుట్ వెంకయ్య, బాపు, శంకర్, శ్యాంలాల్, రాజు, యువకులు మేకల శివకుమార్, సాగర్, సంతోష్, సాయి, తిరుపతి, గణేశ్, స్వామి, రాజు, శశి, రాహుల్, కృష్ణ, భద్రి, శ్రీను పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

కెరమెరి, జనవరి 16 : మండలంలోని సాకడ(శ్యాంరావ్‌గూడ) గ్రామంలో ఏర్పాటు చేసిన కబడ్డీ పోటీల్లో విజేతలైన జట్లకు సోమవారం బహుమతులు ప్రదానం చేశారు. ఓం జై శ్రీ బాబా యూత్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు సాగిన స్వర్గీయ పెందోర్ జంగు పటేల్ స్మారక కబడ్డీ పోటీల్లో 40 జట్లు పాల్గొన్నాయి. హోరాహోరీగా సాగిన ఈ పోటీలో విజేతగా నిషాని జట్టు గెలుపొందగా రూ. 7,777 నగదు బహుమతిని ఎంపీపీ మోతీరాం అందించారు. ద్వితీయ విజేతగా నిలిచిన ఆదివాసీ నగర్ జట్టుకు ఎస్సీఈఆర్పీ చాహకటి శ్యాంరావ్ రూ.4,444, తృతీయ స్థానం సాధించిన సుర్దాపూర్ జట్టుకు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పెందోర్ ఆనందరావ్ రూ, 2,222 నగదు బహుమతిని అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కుమ్రం నాణేశ్వర్, జగన్నాథ్‌రావ్, గ్రామ పటేల్ దంబీరావ్, నాయకులు మడావి భరత్, పూసం భీంరావ్, సిడాం ధర్మ, కుడ్మెత సోము, కొట్రంగే తిరుపతి, సాయిరాం, ఎంపైర్లుగా చందన్‌షా, దుర్వ శ్రీనివాస్, సెడ్మారావ్, రాంచందర్, నిర్వాహణ కమిటీ సభ్యులు పెందోర్ శ్రీనివాస్, సెడ్మాకి తుకారాం, పెందోర్ మాణిక్‌రావ్, వినేశ్, సోము, శంకర్, సాగర్, లక్ష్మణ్‌తోపాటు యూత్ సభ్యులు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి : వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ డుబ్బుల నానయ్య, నాయకులు

కెరమెరి : నగదు బహుమతి అందిస్తున్న ఎంపీపీ మోతీరాం

దుప్పట్లు పంపిణీ

కొలాంగూడ లో దుప్పట్లు పంపిణీ చేస్తున్న రెబ్బెన ఎస్ఐ చంద్రశేఖర్

రెబ్బెన, జనవరి 16: మండలంలోని గోలేటి గ్రామ పంచాయతీ పరిధిలోని కొలాంగూడ, పటేల్‌గూడ గ్రామాల్లో 'పోలీసులు మీ కోసం' కార్యక్రమంలో భాగంగా రెబ్బెన పోలీసుల ఆధ్వర్యంలో 50 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రెబ్బెన ఎస్ఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ పోలీసుల ఆధ్వర్యంలో పేదలకు అండగా ఉంటామన్నారు. గ్రామాల్లో గంజాయి సాగు, గుడుంబా తయారీ, విక్రయాలు, రవాణా, వినియోగంపై నిఘా పెట్టామని చెప్పారు. ఈ నేపథ్యంలో ఎవరికైనా తెలిస్తే తమకు సమాచారం అందించాలని కోరారు.

క్రీడా సామగ్రి పంపిణీ

క్రీడా సామగ్రి పంపిణీ చేస్తున్న నంబాల సర్పంచ్ చెన్న సోమశేఖర్

రెబ్బెన, జనవరి 16: మండలంలోని నంబాల గ్రామ పంచాయతీలో మంగళవారం క్రీడా సామగ్రిని యువతకు సర్పంచ్ చెన్న సోమశేఖర్ పంపిణీ చేశారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండి, క్రీడలపై దృష్టి సారించాలని కోరారు. మాజీ సర్పంచ్ వెంకటి, వార్డు సభ్యులు సంజుకుమార్ జైస్వాల్, యువ నాయకులు పాగిడి మున్నా, తదితరులున్నారు.

ఆర్థికసాయం

ఆర్థిక సహాయం అందిస్తున్న మిత్ర సేవా సమితి ప్రతినిధులు

కాగజ్‌నగర్, జనవరి 16 : పట్టణానికి చెందిన ఎల్ఐసీ ఏజెంట్ పార్వతి శ్రీనివాస్‌కు మిత్ర సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం రూ. 18,200 అందించారు. ఇటీవల ఆయన రోడ్డు ప్రమాదంలో గాయపడగా ఆర్థికసాయమందించినట్లు సమితి సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మిత్ర సేవా సమితి గౌరవ అధ్యక్షుడు డాక్టర్ విద్యాసాగర్, వ్యవస్థాపక అధ్యక్షుడు తిరుపతి, ప్రతినిధులు బాలకృష్ణ, బాబురావు, దేవాజీ, శ్యామ్ రావు, శ్రీనివాస్, నాగమణి, మంజుల, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

జాబ్ కార్డ్‌కు ఆన్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేయాలి

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్ టౌన్, జనవరి16: భవన నిర్మాణ కార్మికుల జాబ్ కార్డ్ కోసం ప్రతి మండల కేంద్రంలో ఆన్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ కోరారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బాలకిషన్ తో కలిసి కలెక్టర్ బోర్కడే హేమంత్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలో భవన నిర్మాణ రంగంలో వేల సంఖ్యలో కార్మికులు పనిచేస్తున్నారని, వెల్ఫేర్ బోర్డులో పేరు నమోదు కోసం మీసేవ సెంటర్లకి కార్మికులు వెళ్తుంటే ఎక్కువ సమయం పడుతున్నదనే సాకుతో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను చేయడం లేదన్నారు. దీని మూలంగా ఎక్కువ మంది కార్మికులు నష్టపోతున్నారని, ఇప్పటికీ చాలా మంది కార్డ్ లబ్ధిదారులుగా ఆన్‌లైన్ సెంటర్లో ప్రక్రియను నమోదు చేయకపోవడం మూలంగా చాలామంది కార్మికులు లబ్ధిదారులు నష్టపోతున్నారన్నారు. జాబ్ కార్డుల నమోదు ప్రక్రియ కోసం కార్మికులు మీసేవ సెంటర్లకు వెళ్తుంటే అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారన్నారు. ప్రతి మండల కేంద్రంలో ఆన్లైన్ సెంటర్ ను ఏర్పాటు చేసి అదనపు వసూలు చేస్తున్న మీసేవ సెంటర్లపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. స్పందించిన కలెక్టర్ కార్మికులకు ఇక నుంచి ఏ ఇబ్బందులు లేకుండా చూస్తానని మీ సేవ ప్రతినిధులు అధిక చార్జీలు వసూలు చేస్తే తన దృష్టికి తీసుకురావాలని సూచించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పెరిక శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్ కనెక్షన్ల పంపిణీ

గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తున్న ఏజెన్సీ డీలర్ జానకి రావు

కౌటాల, జనవరి: వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో మండల కేంద్రానికి చెందిన సిద్ధార్థ హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో ఐదుగురు లబ్ధిదారులకు ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకం కింద ఉచిత గ్యాస్‌లు పంపిణీ చేసినట్లు డీలర్ దుర్గం జానకీరావు తెలిపారు. ఈ వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో కేంద్ర ప్రభుత్వం ప్రవేవపెడుతున్న పతకాలపై అవగాహన, వాటి లబ్ది తదితరాల గురించి అవగాహన కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో టీజీబీ మేనేజర్ నరసింహ స్వామి, ఏఎన్ఎం రజిని, ఆరోగ్య మిత్ర మందాకిని, బీజేపీ కార్యకర్తలున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కౌటాల, జనవరి 16 : మండల కేంద్రంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యు త్ సరఫరాలో అంతరాయం కలుగనున్నట్లు ఏఈ రవీందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలోని గురుడుపేట, కన్నెపల్లి, బోదంపల్లి, కనికి గ్రామాలకు విద్యుత్ సరఫరాలో నిలిచిపోనున్నట్లు పేర్కొన్నారు. బుధవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉండదని వినియోగదారులు గమనించాలని కోరారు.